# రెవిన్యూ స్టాంపు

కంచంలో అన్నం వడ్డించింది రామక్క. ఇంత ఉల్లిగడ్డ కారం యేసింది. చిట్టిలోంచి చారెడు నెయ్యి అన్నం మీద గుమ్మరించింది. 'కలుపుకో' అంది కొడుక్కి విసనకర్రతో విసుర్తా.

కొడుకు పక్కనే కూర్చున్నాడు సీతయ్య. జానెడు పీట మీద ఇరుకిరుకుగా కూర్చున్నా అది ఇరుకనిపించడం లేదు. కానీ కట్టుకున్న పెండ్లాం కట్టుకున్నోడి కంటే కన్నోడికి కొసరి కొసరి వడ్డిస్తాంటే మాత్రం మనసులో ఇరికిరుగ్గా ఉంది.

అంతకు ముందు అదే చోట తనా కంచంలో అదే గొడ్డుకారం కలుపుకుని తను తిన్నాడు. అది తిన్న తర్వాత ఉల్లిగడ్డలు మాత్రమే ఉడకేసిన పులుసు వడ్డిస్తే అదీ తిన్నాడు. ఆపై ఇన్ని మజ్జిగ నీళ్లు గుమ్మరిస్తే కంచం నిండా పోసుకుని అన్నం పిసుక్కుని తిన్నాడు. తనతోపాటు రామక్క అవే తిన్నది.

కానీ నేయి గుమ్మరించటం అటుంచి, నేచ్చుక్క విదిలించను కూడా లేదు. ఇప్పుడేమో కొడుక్కు. అప్పుడు లేని నెయ్యి ఇప్పుడెలా వచ్చింది.

సీతయ్య చూస్తున్నాడు. కానీ ఏమీ అనలేదు. నెయ్యేసుకుని తిన్నీకి తనేం మా రాజా? తన కొడుకేం జమిందారా ? ఉన్న ఒక్క గొడ్డూ శేరు పాలిస్తే పాలమ్మి, పెరుగమ్మి, నెయ్యమ్మి ముల్లెకడ్తేనే గదా పిడ్ని ఎమ్మే సదివించడం అయ్యింది. కడుపు గట్టుకుంటేనే గదా ముల్లెముడేసేది'....

అయినా ఇంటిది తనతో ఏమంది? "ఇదో! కొడుకు పుట్నాడు. ఈడ్ని మా యన్న కొడుకులాగా సదిగించు. నీలాగా నాలాగా మట్టి పిసుక్కునే బతుకు ఈడికొద్దు. నా కొడుకు దర్జా ఎలగబెట్టాల. సదుకుని ఉజ్జోగం సెయ్యాల"

అదంతా ఇప్పుడేమయింది?

'సదువై పోయిందనుకో. ఉజ్జోగం గూడా వస్తుందే అనుకో... అప్పుడు ఎలగబెట్టేను తన దరిజా. దిలాసా. ఆల్లేదు సూల్లేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్టుంది దీని యిరగబాటు' అనుకున్నాడు.

గొడ్డు కారం కలుపుకున్నాడు చంద్రం... ఉహూ ఒక్క ముద్దా నోట్లోకి పోవడం లేదు

చంద్రానికి... ఊహూ చంద్రశేఖరానికి. అతనిప్పుడు రెడ్డోళ్ళ చంద్రశేఖరం ఎం.ఏ. బిఎడ్... మొన్నమొన్నటి దాకా ఇదే పల్లెలో ఇదే మిద్దె ఇంట్లో ఉంటూనే పక్కనున్న తాలూకా కేంద్రంలోని హైస్కూలు చదువూ, అక్కడే జూనియర్ కాలేజీలో ఇంటర్, ఆ పై డిగ్రీ కాలేజీలో బియస్సీ పూర్తి చేశాడు. హైస్కూలు చదువు నడకతో పూర్తి చేశాడు. ఇంటర్, డిగ్రీ సైకిల్ పై తిరుగుతూ పూర్తి చేశాడు. ఆ తర్వాత పట్టుబట్టి యూనివర్శిటీలో ఎం.ఎ. పూర్తి చేశాడు. అక్కడే టీచర్ ట్రైనింగూ పూర్తి చేశాడు. ఈ మూడేళ్లలోనే చంద్రశేఖరంలో బాగా మార్పు వచ్చింది.

డ్రెస్‌లో మార్పు, తలకట్టులో మార్పు వచ్చింది. మాటతీరే మారిపోయింది. అక్కడ హోటళ్లలో, మెస్సుల్లో రకరకాల తిండి తిని సెలవులకు వచ్చి ఒకటి రెండు వారాలు ఉండూర్లో గడపడం అతనికి పాండవుల అరణ్యవాసం, శ్రీరాముడి అరణ్యవాసం కంటే కష్టం అనిపించేది.

కొడుకు తీరులో మార్పుని సీతయ్య గమనించినా రామక్క గుర్తించలేకపోయింది.

'వాడీన్నూళ్లో ఉంటే సదువుకొచ్చిన నాలుగచ్చరాలూ మర్చిపోతాడు. ఉండేది ఒక్కడు. బాగా సదవనీ ఆడ్నే ఆడనే ఉండనీ' అని మొగుడ్ని దబాయించి సెలవుల్లో కూడా అక్కడికే పంపేది.

డిగ్రీ పూర్తయ్యాక కూడా ఒకింత ఘర్షణే అయ్యింది. 'ఇగ జాలు - టీశర్ ట్రైనింగ్ జెయ్యి. ఉండూర్లో ఉజ్జోగం యేయిస్తా' అన్నాడు సీతయ్య.

సర్రున కత్తిదూసినట్టు అడ్డొచ్చింది రామక్క 'నా కొడుకు కలకటేరో, ఇంజనీరో, డాకటేరో అయితాడని నేనాశపడ్తంటే నువ్వేంది యిక సాలు సాలంటావు' అంది.

'డాక్టర్ కావాలంటే మెడిసిన్ చదవాలి' అన్నాడు చంద్రం....

'అదెన్నేళ్లు?" అడిగాడు సీతయ్య.

'నాలుగేళ్ల పైమాటే. ఆపైన యేడాది హౌస్‌సర్జెన్సీ'

మనసులో ఏదేదో లెక్కలేసుకుని 'ఇంజనీరు గావాలంటేనో?' అడిగింది రామక్క.

'అదిప్పుడు కష్టమమ్మా! లెక్కలు చదవలేదు.

'మరి కలకటేరు గావాలంటే?'

'ఐఎఎస్ పాసవాల. ముందు ఎమ్మే చదవాల'

'అయితే అదేదో సదువు. దానికెన్నేండ్లు పడ్తుంది'.

'ఎమ్మేకు రెండేండ్లు. తర్వాత మనమే చదువుకుంటూ ఐఎఎస్ పాసవ్వాలి. దానికి ఢిల్లీలో ట్రైనింగ్ ఇస్తారు.'

'అట్లయితే ముందది రెండేండ్లు సదివిరా!' రేపొద్దున్న ఎల్లి కనుక్కురా!'

'అదట్లా కాదమ్మా.. అది యూనివర్శిటీలోనే చదవాల....'

నోరు వెళ్ళబెట్టిందామె.

'ఏందది ఈగలు ముసుర్తాయ్' ఎగతాళిగా అన్నాడు సీతయ్య.

మూతి మూడు వంకర్లు తిప్పిందామె. 'శానా కర్సయితాదా?'

'కర్సు మాట నీకెందుకే ఇంటిదానా? నువ్వు నీ కొడుకు నిడిసి ఉంటావా? అజ్జెప్పు'.

రామక్క కళ్లు చెమర్చాయి.

'ఎట్టయితది? ఆడు బాగా సదుకుని కలకటేరై బంగలాలో ఉంటే పెండ్లాంతో దర్జాగా కార్లో సికారొస్తే సూడాలంటే ఇప్పుడిడిసి ఉండకపోతే ఎట్టా?'

'సరే!' అన్నాడు సీతయ్య.

ఎమ్మే కూడా అయిపోయింది.

ఈలోగా ఆ ఊళ్లోనే హైస్కూలు పెట్టారు. దాంతో సీతయ్య మనసు మారిపోయింది. టీచర్లను కలుసుకుని ఆ ఉజ్జోగం రావాలంటే ఏమేం చదవాలో తెలుసుకున్నాడు. అదే చదవమన్నాడు. 'ఇంటి పట్టున ఉండొచ్చు. కడుపులో చల్ల కదలకుండా నెలకు రెండేసి యేలు సంపాయించొచ్చు. యాడాదికి పండెండు రెండ్లు దాదాపు పాతికయేలు. నాలుగేండ్లలో లచ్చ దాటిపోతాది. తను లచ్చాదికారి....' మూస్తూ మూస్తూ ఆ భాగ్యం పోగొట్టుకోలేకపోయాడు.

అందుకే శతపోరి ట్రైనింగ్‌కు పంపించాడు. 'ఇది సదుకుంటూనే ఆ పరీచ్చలు రాయొచ్చంట గదా" అని కొడుకుని ఒప్పించాడు. కొడుకుని ఢిల్లీకి పంపడానికి ఓ మంచి ఐడియా వేసి అడ్డేవాడు 'అక్కడ ఎప్పుడూ గలాటాలు జరుగుతంటాయంట! బాంబులేసి, పిస్తోల్లు కాల్చి మడుసుల్ని ఊరికినే సంపేస్తా ఉంటారంట!' అని చెప్పాడు.

రామక్క గుండె చెరువై పోయింది.

'ఒద్దురా నాయనా! సెంద్రుడూ! నువ్వెల్లొద్దు రా బాబూ! అదేదో ఆ సదువు ఈడుండే సదూకో' అంది కన్నీళ్లతో.

అదో అలా అతని బిఎడ్ పూర్తయింది.

కానీ ఐఏఎస్ రాయడానికి ఛాన్స్ రాలేదు.

సర్వీస్ కమీషన్ ఎగ్జామ్స్ రాయడానికి అసలు పరీక్షలే పెట్టలేదు.

ఇప్పుడు ఊరికి వచ్చాడతను.

నోటికి హితవుగా లేదు గొడ్డుకారం. ఒక్క ముద్ద తినగానే కన్నీళ్ళొచ్చాయి. గొంతు పొలమారింది.

'కారం దిన్నీకి అలవాటు తప్పొయింది. చెప్పా పెట్టకుండా దిగబడ్తేయి యాలప్పుడు ఏం వండేది. ఇంగ సదుకుందాం అనుకుంటంటే మనొస్తివి. బావనయ్యకు పొయ్యనికి

తీసిపెట్నా నెయ్యేసినా కారం పోయినట్టు లేదు.'

సీతయ్య నవ్వాడు.

'ఏందా నవ్వు?'

'అదేదో సామెత చెప్పినట్టుంది. ఆరుగాలం సింత సిగురు కోసి సింతకాయలు యీదీదీ తిరిగి అమ్మి, రాజుగారు సేసుకోగానే 'యీ యేంటి వంకరటింకర కాయలందట నోనాపసాని. అట్టుంది నీ యావ్వారం'.

ఆ మాటకూ, ఈ మాటకూ కూడా చంద్రశేఖరం ఏమీ అనలేదు. గొడ్డు కారంతోనే రెండు ముద్దలు మింగి, ఆపై దాన్లోనే పులుసు తనే వడ్డించుకున్నాడు. 'బిడ్డ కారం తిన్లేక పోతన్నాడు' అనుకున్న రాముక్క మరింత నెయ్యి గుమ్మరించింది.

చంద్రశేఖరం కారం, పులుసు అన్నం తిన్నాడు అట్లాగే.

'మజ్జిగ వెయ్'

'మజ్జిగలేవు. అయిపోయినాయి' అంటూ లేచింది 'పెరుగు పోస్తానుండు' అని ఉట్టిమీది నుంచి పెరుగు ముంత దించి పెరుగుతో పాటు మీగడా గుమ్మరించింది.

కమ్మటి పెరుగుతో కంచం అన్నం లాగించాడు చంద్రశేఖరం.

భోజనాల పర్వం పూర్తయ్యింది.

ఇంటి ముందు బయట ముగ్గురూ మంచాల మీద వొరిగారు.

అదే వారంలో జిల్లా ప్రజాపరిషత్ లో సెకండరీ గ్రేడు పోస్టుకు ఇంటర్వ్యూ వచ్చింది చంద్రశేఖరానికి అప్పుడెపుడో వేసిన ప్రకటన చూసి అప్లై చేశాడు.

కొడుకును కూచో పెట్టుకుని చెప్పాడు సీతయ్య.

'ఒరే సెంద్రన్నా! మీ యమ్మదంతా యెర్రెవారం. సిన్నమెత్తు బంగారంతో మెడసుట్టా తీగ గావాలంటాది. అదెట్టబౌతాది. నేనంతా కనుక్కున్నా! కలకటీరుగావాలంటే ఎమ్మెల్లేనో, ఎంపీనో మాకు గావాలంట. మనిండ్లలో అంతం తోల్లు ఎవలుండారు. మనకెవరు బలుకుతారు. గాబట్టి నా మాటిని టీశరుపనికి కుదురుకో మాసాల్లో మనింట్లో బతుకుతా మనింట్లో తింటావు. యాడాదికి సాతికయేలు వొస్తయ్యంట మన పాడి మీద, పంట మీద వొచ్చేది మన బతుకులకు సాలుగదా! నాలుగేండ్లు తిరిగేసరికి లచ్చాధికారివయితావు. ఇల్లు తిరగ్గట్టిస్తా. పెండ్లిజేస్తా. ఆలూ మొగుడూ మా కండ్లెదర తిరుగుతంటే నేనూ, మీ యమ్మా సూసి సంతోసపడ్తాం.

మారుతున్న కాలాన్ని, మారిపోతోన్న సాంఘిక జీవిత విధానాన్నీ, అడుగడుగునా ఉద్యోగాన్వేషణలో ఎదురవుతోన్న రకరకాల అవరోధాల్ని గుర్తించిన చంద్రశేఖరం కాదనేందుకు మరో మార్గం లేక సరే అన్నాడు అదీ లౌక్యంగా.

'నా కింతగా చెప్పాలా నాన్నా! అట్లాగే కానీ' అన్నాడు.

ఇరవయి రెండేండ్లు వచ్చినా- అంత చదువు చదివినా 'నువ్వు గీసిన గిరిలోనే ఉంటాన'న్న కొడుకుని చూసి సీతయ్య ఎంతో సంతోషించాడు. ఊహా గర్వించాడు.

ఇంటర్వ్యూ తేదీ నాటికి గ్రామ సర్పంచ్‌నీ, మండల అధ్యక్షుని, తమ నియోజకవర్గం ఎమ్మెల్యేని శతపోరి జిల్లా ప్రజాపరిషత్తు అధ్యక్షుడికి 'చెప్తాను'ని వాగ్దానం తీసుకున్నాడు.

ఇక ఉద్యోగం వచ్చి ఇంట్లో పడ్డట్టే కొడుకు అక్కడే ఉండినట్టే!

ఆ రాత్రి సీతయ్య రామక్క తెగ సంబరపడిపోయారు.

✧ ✧ ✧

జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూ జరిగిపోయింది. ఆ జిల్లా చైర్మన్ గారికి అందవలసిన సమాచారం అంతా అందింది.

అదిగో అక్కడ వచ్చింది చిక్కు!

ఎర్రగా బుర్రగా వుండి ఎమ్మే ఫస్ట్‌క్లాసులో పాసైన 'తన' కులం కుర్రాడిలా ఓ పల్లెటూళ్లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా 'సెకండ్' గ్రేడ్ జీవితం గడపడం ఇష్టం లేకపోయింది. దానికి తోడు ఇంట్లో పెళ్లికావలసిన కూతురుండడం మరీ అయిష్టం కలిగించింది.

దాంతో మండలాధ్యక్షుడిని ముగ్గులోకి దింపాడు. మరిన్ని విషయాలు రాబట్టాడు. అప్పుడెప్పుడో బ్యాంకింగ్ సర్వీస్‌కి చంద్రశేఖరం పరీక్ష రాసిన విషయమూ తెలిసింది.

దాంతో తన 'పంజా' విస్తరించాడు.

'జాబు కోసమై వలలో పడెనే పాపం పసివాడు' అనుకున్నాడు గ్రామ సర్పంచ్.

✧ ✧ ✧

సెరువులో రాయేస్తే నీళ్లంతా సెల్లా సెదరయిపోతాయి. నీకది తెలుసునా సిన్నోడా! నేనెంత ఆశపడ్డాన్రా! బిడ్డ నాకు కాకుండా పోతాడని యవరూ సెప్పలేదురా కన్నా!'

తండ్రి అలా వేదన పడినా చంద్రశేఖరం ఏమీ అనలేదు. అతనికి సిటీ జీవితం గ్రామజీవితం కళ్ళెదుట నిలిచాయి. ఆ మోహం ముందు తండ్రి ప్రేమ నిలవలేకపోయింది. రామక్కకు కొడుకు బ్రతుకు, భవిష్యత్తు అంతా పంచరంగుల చిత్రంలా కన్పించడంతో ఆమె కిమ్మనలేదు.

కొన్ని కొన్ని సంఘటనలు ఎవరి ప్రమేయం లేకుండానే జరిగిపోతాయి. అలాగే చంద్రం బ్యాంక్ ఉద్యోగం, పెళ్ళి జరిగిపోయాయి. 'పెద్దెత్తున సంభంధం వచ్చింది వాడికి. నొప్పుకో అని రామక్క మొగుడిని వేధించింది.

పెళ్లయిన నెల రోజులలోగానే ఉద్యోగంలో జాయినయిపోయాడు చంద్రశేఖరం. మామాగారి చలువతో సిటీలో కాపురం పెట్టాడు.

కొడుకు వెళ్లిపోగానే ఇల్లంతా శూన్యం అయిపోయిందనిపించింది దంపతులకు. అదేకాదు మరో షాక్ కూడా వారిని కృంగదీసింది.

చంద్రం పెళ్లి ఖర్చు అనుకోనంత అయిపోయింది. ఆ డబ్బులు ఎలాగో తీర్చేయొచ్చనుకున్నా బాకీ విషయం సీతయ్యను భయపెట్టేది. పెళ్ళి ఖర్చులకు సర్దుబాటు చేసిన సర్పంచ్ పెళ్ళిసంబరాలు ముగిసి పోగానే డబ్బుకోసం కబురు పెట్టాడు.

'సదివింపులు కట్నాలు సచ్చింటాయిగదా. నా లెక్క ఇచ్చెయి.'

'కట్నాలు రాలేదు బాబూ కట్టాలు వొచ్చినయ్' అని జరిగింది చెప్పాడు సీతయ్య.

నిట్టూర్చాడు సర్పంచ్

'సర్లే! ఏం చేస్తావ్, నా లెక్కకు పత్తరం రాసెయ్యి.

'పత్రమా'

' ఆ మరి బాండు రాసెయ్యకపోతే ఎట్టా? నీ కాడ లెక్క యాడికి పోతది గానీ! లెక్క లెక్కే గదా! దానికో గుర్తుంటే మంచిది గాదూ!

సీతయ్యకి ఏమనడానికీ పాలుపోలేదు. గత్యంతరం లేక ప్రామిసరీ నోటు రాయించి బాండు బిళ్లలతికించిన తర్వాత ఆ రెవిన్యూ స్టాంపుల మీద ఎడమచేతి బొటనవేలు గుర్తు కందెనతో అద్ది ఆపై గుర్తు వేశాడు.

యాక్సిడెంటల్‌గానే కావచ్చు

అదే రోజు అదే సమయంలో తన తొలి జీతం తీసుకోబోతూ రెవిన్యూ స్టాంపుపై చంద్రంకూడా సంతకం చేశాడు.

● ఉదయం వార పత్రిక ఉగాది ప్రత్యేక సంచిక 1990 ●